ఢిల్లీకి డబ్బు సంచులు

తెలంగాణ నుంచి వైజాగ్ మీదుగా హస్తినకు

- కేంద్ర దర్యాప్తు సంస్థలకూ ఫిర్యాదు చేస్తం
- సీఎం స్పందించకపోవడంతో డౌట్
- త్వరలో సివిల్ సప్లై ఆఫీసు వద్ద ధర్నా
- అన్నదాతకు బోనస్‌గా లాఠీచార్జి
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఫైర్

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): పౌరసరఫరాల సంస్థ కుంభకోణాల ద్వారా వచ్చిన డబ్బును తెలంగాణ నుంచి వైజాగ్ మీదుగా ఢిల్లీ కాంగ్రెస్ పార్టీకి వెళ్తున్నాయని బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. సన్నబియ్యం టెండర్లను రద్దు చేసినట్టుగా ఎక్కడా అధికారికంగా ఇంతవరకు ఉత్తర్వుల ఇవ్వలేదని, దీని వెనక మర్మం ఏమిటని అనుమానం వ్యక్తం చేశారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే పౌరసరఫరాల సంస్థలో జరుగుతున్న కుంభకోణాలపై ఆ సంస్థ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని ప్రకటించారు. ఈ అవినీతి, కుంభకోణాలపై త్వరలో కేంద్ర విచారణ ఏజెన్సీలకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పౌరసరఫరాల సంస్థ కుంభకోణాలపై ఆ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దాటవేత ధోరణిలో ఉన్నారని విమర్శించారు. సివిల్ సప్లయ్ టెండర్లను రద్దు చేస్తున్నట్టు ఎందుకు ప్రకటించలేదని ప్రశ్నించారు. సన్నబియ్యం టెండర్లను ఎల్జీ సంస్థకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. ధాన్యం టెండర్లు దక్కించుకున్న సంస్థలు వసూలు చేసిన డబ్బును విశాఖ పట్నం బ్యాంకుల్లో దాస్తున్నారని ఆరోపించారు. అవి అక్కడి నుంచి ఢిల్లీ కాంగ్రెస్‌కు చేరుతున్నాయని వివరించారు. ఈ కుంభకోణాల వెనక కాంగ్రెస్ పార్టీ ఢిల్లీ పెద్దలు ఉన్నారని పేర్కొన్నారు. టెండర్ల ధర కంటే అదనంగా మిల్లర్ల దగ్గర డబ్బులు వసూలు చేస్తున్నారని, ధాన్యం, సన్నబియ్యం టెండర్ల అవినీతిపై సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు నోరు మెదపడం లేదని నిలదీశారు. సీఎం ఢిల్లీలో ఉంటే, డిప్యూటీ సీఎం పంజాబ్‌లో ఉన్నారని, ఉత్తమ్‌కుమార్ దేవుళ్ల చుట్టూ తిరుగుతున్నారని, రాష్ట్రంలో సగం క్యాబినెట్ లేదని విమర్శించారు.

సీఎం పేషీ నుంచే

ధాన్యం కుంభకోణంలో కాంగ్రెస్ ఢిల్లీ పెద్దలకు మూటలు పంపించిన మిల్లర్లను వదిలేస్తున్నారని, పంపని వారిని డిఫాల్టర్స్ చేస్తామని బెదిరిస్తున్నారని పెద్ది తెలిపారు. రాష్ట్రంలో బ్రూ ట్యాక్స్ కట్టిన వారికి మాత్రమే క్లియరెన్స్ ఆర్డర్‌లు వస్తున్నాయని, 250కు పైగా మిల్లర్లు అదనంగా బిడ్డర్ల అకౌంట్లలో డబ్బులు వేశారని తెలిపారు. ఈ కుంభకోణంపై విజిలెన్స్, ఏసీబీ వెంటనే స్పందించాని కోరారు. వసూలు చేసిన డబ్బును వెంటనే సీజ్ చేయకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కేంద్రీయ భాండార్ సంస్థ ఏకలవ్య స్కూల్స్‌కు బియ్యం పంపిణీ చేస్తామని చెప్పి డిఫాల్టర్ అయిందని, అక్కడ ఆ సంస్థ బ్లాక్‌లిస్ట్‌లో ఉందని పేర్కొన్నారు. అవినీతి, కుంభకోణంపై సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటి వరకు మాట్లాడకపోవడం అనుమానాలకు తావిస్తున్నదని తెలిపారు. ఎఫ్‌సీఐ కేంద్రం పరిధిలోనే ఉందని, సివిల్ సప్లయ్ అవినీతిపై బీజేపీ కేవలం ఆరోపణలకు మాత్రమే పరిమితం అయిందని, ఢిల్లీకి వెళ్లి ఫిర్యాదులు ఎందుకు చేయడం లేదని నిలదీశారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఎఫ్‌సీఐపై ఎందుకు సమీక్షలు చేయడం లేదని ప్రశ్నించారు. టెండర్లు పొడిగించకుండారద్దు చేయాలని డిమాండ్ చేశారు.

మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి. చిత్రంలో నేతలు గెల్లు శ్రీనివాస్, రాకేశ్‌కుమార్, పల్లె రవికుమార్

రైతులకు క్షమాపణ చెప్పాలి

ఆదిలాబాద్‌లో రైతులపై లాఠీచార్జ్‌ను తీవ్రంగా ఖండిస్తున్నట్టు పెద్ది తెలిపారు. రాష్ట్రంలో విత్తనాల సరఫరాపై ప్రభుత్వానికి అవగాహన లేదని, విత్తనాల కోసం రైతులు క్యూలలో చెప్పుడు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన బోనస్ లాఠీచార్జ్ అని ఎద్దేవా చేశారు. రైతులకు ప్రభుత్వం వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం లాఠీచార్జ్‌ను గిఫ్ట్‌గా ఇచ్చిందని విమర్శించారు. సమావేశంలో బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు రాకేశ్‌కుమార్, పల్లె రవికుమార్, బీఆర్‌ఎస్‌వీ నాయకుడు బాలు పాల్గొన్నారు.

సురవరం ప్రతాపరెడ్డి మహోన్నత వ్యక్తి

- జయంతి సందర్భంగా మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఘన నివాళి

మహబూబ్‌నగర్ అర్బన్, మే 28 : తెలంగాణ వైతాళికుడిగా సురవరం ప్రతాపరెడ్డి ఒక ప్రాంతానికి.. వర్గానికి పరిమితమైన వ్యక్తి కాదని, ఆయన జీవిత చరిత్రను నేటి సమాజానికి తెలియజేయాల్సిన అవసరం ఉన్నదని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మహబూబ్‌నగర్‌లోని పద్మావతి కాలనీ గ్రీన్‌బెల్ట్‌లో మంగళవారం సురవరం ప్రతాపరెడ్డి జయంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు సురవరం కపిల్, నివేదిత తదితరులతో కలిసి సురవడం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. సమాజం మొత్తం బాగుపడాలనే ఉద్దేశంతో సురవరం పని చేశారని కొనియాడారు. ఆయన ఆస్తులను త్యాగం చేసిన మహోన్నతమైన వ్యక్తి అని కీర్తించారు. తెలంగాణలో కవులే లేరని చెప్పిన రోజుల్లో 350 మంది కవులతో కూడిన గోల్కొండ కవుల సంచికను ప్రకటించి విమర్శకులకు గట్టి సమాధానం ఇచ్చారని గుర్తుచేశారు. తెలంగాణ సాహిత్యానికి జాతీయ స్థాయిలో సురవరం గుర్తింపు తీసుకొచ్చి, ప్రజలను చైతన్యపరచడంలో కీలకపాత్ర పోషించిన గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు. అలాంటి మహానుభావుడు పాలమూరు జిల్లాకు చెందిన వ్యక్తి కావడం గర్వకారణమని అన్నారు.

ఫోన్‌ట్యాపింగ్ చేస్తే మళ్లీ బీఆర్‌ఎస్సే వచ్చేది

- ఐదుసార్లు ఓడిన వ్యక్తి మాట్లాడటం విడ్డూరం: కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్

కరీంనగర్ కార్పొరేషన్, మే 28 : గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాంగ్రెస్ నాయకుడు నర్సింగరావు ఫోన్ ట్యాప్ చేసి ఉంటే బీఆర్‌ఎస్ రాష్ట్రంలోని అన్ని స్థానాల్లో గెలిచి, అధికారంలోకి వచ్చేదని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల అన్నారు. కోరుట్లలో ఐదుసార్లు పోటీ చేసి ఓడిపోయిన నర్సింగరావు ఏదో పెద్ద నాయకుడిని అనుకొని మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. మంగళవారం కరీంనగర్‌లోని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ గాలి వీచిన 2009 ఎన్నికల్లోనూ నర్సింగరావు 17 వేల ఓట్లతో ఓడిపోయారని, తర్వాత ఎన్నికల్లో 70 వేల ఓట్లతో, 2014లో 22 వేల ఓట్లతో, 2018లో 32 వేల ఓట్ల తేడాతో ఓడిపోయారని గుర్తుచేశారు. 2023 ఎన్నికల్లో కనీసం డిపాజిట్ కూడా రాలేదని విమర్శించారు. కనీసం రెండో స్థానం కూడా రాలేదని, అలాంటి వ్యక్తి ఫోన్ ఎందుకు ట్యాప్ చేస్తారని ప్రశ్నించారు. ఐదుసార్లు పోటీ చేసినా ప్రజలు కనీసం ఆయన్ను గుర్తించలేదని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో మొన్నటి వరకు ఆయనకు ఎలక్షన్ రాజా అని పేరు ఉందని, ఇప్పుడు అది కలెక్షన్ రాజాగా మారిందని ఆరోపించారు. నియోజకవర్గంలో రైస్‌మిల్లర్స్, ఇతరులను బెదిరించి వసూళ్లు చేస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో 60 ఏండ్ల దరిద్రాన్ని కేసీఆర్ పదేండ్లలోనే తొలగించారని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఆ దరిద్రాన్ని మళ్లీ తీసుకువచ్చిందని, పూర్తిగా విధ్వంసం చేస్తున్నదని విమర్శించారు. కాంగ్రెస్ ఆరు నెలల పాలనలోనే కుంభకోణాలు బయటకు వస్తున్నాయని తెలిపారు. పరిశ్రమలు కూడా రాష్ట్రాన్ని వీడిపోతున్నాయని అన్నారు. మొన్నటి వరకు కాళేశ్వరం ప్రాజెక్టు ఎందుకూ పనికిరాదంటూ హంగామా చేసిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు మేడిగడ్డ వద్ద మరమ్మతు పనులు ప్రారంభించారని పేర్కొన్నారు.

హిందూ వివాహ ఎస్టీలకు ఆ చట్టం వర్తింపు

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): హిందూ సంప్రదాయాలను పాటిస్తూ ఆ పద్ధతి ప్రకారం వివాహం చేసుకున్న గిరిజన దంపతులకు విడాకులు మంజూరు చేసేందుకు హిందూ వివాహ చట్టాన్ని వర్తింపజేయొచ్చని హైకోర్టు స్పష్టం చేసింది. ఆ వివాహాలు హిందూ సంప్రదాయ పద్ధతిలో జరిగినట్టు ఆధారాలుంటే హిందూ వివాహ చట్టం ప్రకారం విడాకులు మంజూరు చేయవచ్చని జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలానికి చెందిన కడావత్ శ్రీకాంత్, అశ్విత పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకునేందుకు కామారెడ్డి సివిల్ కోర్టును ఆశ్రయించడంతో.. ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన వారికి హిందూ వివాహ చట్టం వర్తించబోదంటూ పిటిషన్‌ను స్వీకరించలేదు. దీన్ని సవాలు చేస్తూ వారు దాఖలు చేసిన సివిల్ రివిజన్ పిటిషన్‌పై ఇటీవల హైకోర్టు విచారణ చేపట్టింది.

పిల్లలను విక్రయించే ముఠా అరెస్ట్

- ఢిల్లీ, మహారాష్ట్ర నుంచి పసిపిల్లల కొనుగోలు
- తెలుగు రాష్ట్రాల్లో సంతానం లేనివారికి విక్రయాలు
- ఇప్పటికే 50 మంది పిల్లల విక్రయం
- శిశువిహార్‌కు 11 మంది అప్పగింత
- ఆర్‌ఎంపీ వైద్యురాలి ముఠాలో 8 మంది అరెస్ట్, ముగ్గురు పరారీ

శిశు విహార్ అధికారులకు చిన్నారిని అప్పగిస్తున్న రాచకొండ సీపీ తరుణ్‌జోషి

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 28 (నమస్తే తెలంగాణ): ఇతర రాష్ట్రాల నుంచి పసిపిల్లలను కొని హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాలలో విక్రయిస్తున్న ముఠాను రాచకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్టు అయిన వారిలో ఆర్‌ఎంపీతో ఎనిమిది ఉన్నారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. నిందితులను విచారణలో అంతరాష్ట్ర పసిపిల్లల విక్రయాల గుట్టు రట్టయ్యింది. మంగళవారం హైదరరాబాద్ నెరేడ్‌మెట్‌లోని రాచకొండ కమిషనరేట్‌లో రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఈ నెల 22న మేడిపల్లి పోలీసులకు పసిపిల్లల విక్రయాలపై వచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి స్థానికంగా ఉన్న ఆర్‌ఎంపీ డాక్టర్ ఐతే శోభారాణి, ఉప్పల్ ఆదర్శనగర్‌కు చెందిన స్వప్న, రామకృష్ణానగర్‌కు చెందిన సలీం పాషాను అరెస్టు చేశారు. వీరు హైదరాబాద్, విజయవాడ ప్రాంతాల్లో పిల్లలు లేని వారితో ఒప్పందాలు చేసుకొని రూ. 1.8 లక్షల నుంచి రూ. 5.5 లక్షల వరకు పసిపిల్లలను విక్రయిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఢిల్లీ, పుణెల నుంచి పసిపిల్లలను కొని తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాలలోని పిల్లలు లేని వారికి విక్రయిస్తున్నట్టు గుర్తించారు. ఆర్‌ఎంపీ డాక్టర్ శోభారాణి ముఠాలో అన్నోజిగూడకు చెందిన సెక్యూరిటీ గార్డు బండారి హరిహర చేతన్, అతని తల్లి బండారు పద్మ, విజయవాడకు చెందిన బల్గం సరోజ, ముదావత్ శారద, ముదావత్ రాజు, పఠాన్ ముంతాజ్, జగన్నాథం అనురాధ, చర్లపల్లికి చెందిన యాత మమత ఉన్నట్టు గుర్తించి మంగళవారం ఈ 8 మందిని అరెస్ట్ చేశారు. ఢిల్లీకి చెందిన కిరణ్, ప్రీతి, పుణెకు చెందిన కన్నయ్య అక్కడి నుంచి పిల్లలను ఈ ముఠాకు సరఫరా చేస్తున్నట్టు గుర్తించారు. ఇప్పటి వరకు ఈ ముఠా 50మంది పసిపిల్లలను రెండు తెలుగు రాష్ట్రాలలో విక్రయించినట్టు గుర్తించారు. అందులో 11మంది పసిపిల్లలను చైల్డ్ వెల్ఫేర్ కమిటీతో సమన్వయం చేసుకొని రెస్క్యూ చేసి, శిశువిహార్‌కు అప్పగించినట్టు సీపీ వెల్లడించారు. బండారి పద్మ, బల్గం సరోజ, ముదావత్ శారదలపై ఏపీ, తెలంగాణ, మహారాష్ట్రలోనూ కేసులు ఉన్నాయని సీపీ తెలిపారు. ముంబయిలో నమోదైన కేసులో శారద పరారీలో ఉందని సీపీ వెల్లడించారు. పిల్లలను కొనుగోలు చేయడం నేరమని, దత్తత తీసుకోవాలనుకునే వారు అధికార వెబ్‌సైట్లో దరఖాస్తు చేసుకోవాలని మేడ్చల్ జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ రాజారెడ్డి తెలిపారు. ఇదిలా ఉంటే పోలీసులు పసిపిల్లలను శిశువిహార్‌కు తరలిస్తుంటే కొన్న తల్లిదండ్రులు కమిషనరేట్‌కు చేరుకొని రోదించారు.

హైదరాబాద్-శ్రీశైలం మార్గంలో భారీ ఎలివేటెడ్ కారిడార్

- నాలుగు లేన్లతో 70 కి.మీ. మేర నిర్మాణానికి ప్రతిపాదన

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్-శ్రీశైలం రోడ్డు మార్గాన్ని మెరుగుపర్చడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. అందులో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లాలోని మన్ననూర్ ఫారెస్ట్ చెక్‌పోస్టు నుంచి శ్రీశైలం వరకు అత్యంత పొడవైన ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించింది. ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేస్తే రాత్రి వేళల్లో సైతం ఎలాంటి అడ్డంకులు లేకుండా శ్రీశైలం వెళ్లేందుకు వీలవుతుంది. హైదరాబాద్-శ్రీశైలం మార్గంలో టైగర్ రిజర్వు ఫారెస్ట్ ఉన్నందున ప్రస్తుతం మన్ననూరు చెక్‌పోస్టు నుంచి రాత్రి వేళల్లో ప్రయాణాలను అనుమతించడం లేదు. ప్రస్తుతం ఆ మార్గంలో 70 కి.మీ. మేర డబుల్ లేన్ మాత్రమే ఉండడంతో ట్రాఫిక్ అవసరాలకు సరిపోవడం లేదు. ఈ మార్గాన్ని విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించినప్పటికీ నల్లమల అటవీ ప్రాంతం కావడంతో అనుమతులు లభించడంలేదు. ఈ నేపథ్యంలో మన్ననూర్ చెక్‌పోస్టు నుంచి నల్లమల అటవీ ప్రాంతం మీదుగా శ్రీశైలం వరకు 4 లేన్లతో 70 కి.మీ. పొడవైన ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జాతీయ రహదారుల శాఖ ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్టును నిర్మించాలని రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ కేంద్రానికి ప్రతిపాదనలు సమర్పించింది.

పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ 72.44 శాతం

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): నల్లగొండ, వరంగల్, ఖమ్మం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో 72.44 శాతం ఓట్లు పోలయ్యాయి. తుది పోలింగ్ శాతాన్ని మంగళవారం ఎన్నికల అధికారులు అధికారికంగా ప్రకటించారు. ఉప ఎన్నికలో మొత్తం 4,63,839 ఓట్లుండగా 3,36,013 పోలయ్యాయని తెలిపారు. పురుషులు 73.71 శాతం, మహిళలు 70.34 శాతం ఓట్లు పోలయ్యాయి.యాదాద్రి భువనగిరి జిల్లాలో అత్యధికంగా 78.59%, అతి తక్కువగా ఖమ్మం జిల్లాలో 67.62 శాతం ఓట్లు పోలయ్యాయి. ఈ నెల 5న ఓట్ల లెక్కింపును ప్రారంభిస్తారు.

'ఎస్సీ గురుకులాల పదోన్నతుల సమస్యను పరిష్కరించండి'

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): మిగతా గురుకులాల్లో మాదిరిగానే ఎస్సీ గురుకుల పాఠశాలల్లో పదోన్నతులు కల్పించాలని జేఏసీ ఉపాధ్యాయ సంఘం డిమాండ్ చేసింది. మంగళవారం ప్రభుత్వ ముఖ్యకార్యదర్శిని ఎస్సీ గురుకులాల జేఏసీ ప్రతినిధులు నారాయణ, మధుసూదన్,జనార్దన్, వేదాంతచారి, బిక్షం కలిసి వినతిపత్రం అందజేశారు. గురుకులాల్లో ప్రిన్సిపాల్ పోస్టుకు 1:3 సెలక్షన్ నిర్వహించడంతో సీనియర్లు నష్టపోవాల్సి వస్తుందని వివరించారు. పీజీటీ, జేఎల్ పదోన్నతుల్లో మిగతా గురుకుల సొసైటీల్లో అనుసరిస్తున్న 70:30 పద్ధతిలో కాకుండా 50:50ను పాటించడం వల్ల నష్టపోవాల్సి వస్తుందని వాపోయారు. సమస్యను న్యాయబద్ధంగా పరిష్కరించాలని కోరారు.

యువకుడి కిడ్నాప్.. హత్య

మానకొండూర్ రూరల్, మే 28 : ఓ యువకుడిని గుర్తుతెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసి, ఆపై హత్య చేసిన ఘటన కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలంలో కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూర్ మండలం పచ్చునూర్‌కు చెందిన గోపు ప్రశాంత్‌రెడ్డి (20)ని మంగళవారం తెల్లవారుజామున గ్రామ శివారులోని శివాలయం వద్ద గుర్తుతెలియని వ్యక్తులు చితకబాదారు. దెబ్బలు తట్టుకోలేక పాడుబడ్డ బావిలో దూకిన ప్రశాంత్‌రెడ్డిని వారు బయటకు తీసి, కారులో తీసుకెళ్లారు. స్థానికులు అప్పటికే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చుట్టుపక్కల గ్రామాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రంకల్లా పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి శివారులోని మానేరు వాగులో ప్రశాంత్‌రెడ్డి మృతదేహన్ని గుర్తించారు. మృతుడి తల్లిదండ్రులు పదేండ్ల క్రితమే మరణించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురి దుర్మరణం

- ఖమ్మం జిల్లాలో కుక్కను తప్పించబోయి కారు బోల్తా

రఘునాథపాలెం/మక్తల్ టౌన్, మే 28 : రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు దుర్మరణం చెందారు. ఖమ్మం, నారాయణపేట జిల్లాల్లో మంగళవారం జరిగిన ప్రమాదాలకు సంబంధించిన వివరాలు ఇలా.. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం బావోజీ తండాకు చెందిన బోడా ప్రవీణ్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు దవాఖానలో ఫిజియోథెరపిస్ట్‌గా పనిచేస్తూ.. కుటుంబంతో కలిసి అక్కడే నివాసం ఉంటున్నారు. ప్రవీణ్‌కు భార్య కుమారి(27), ఇద్దరు ఆడపిల్లలు కృషిక(2), క్రితయన(3) ఉన్నారు. ప్రవీణ్ తన ఇద్దరు పిల్లల ఆధార్ కార్డులను అప్‌డేట్ చేయించాలని మంగళవారం వారిని కారులో తీసుకొని ఖమ్మం బయలుదేరాడు. ఆధార్ సెంటర్‌లో కార్డులను అప్‌డేట్ చేయించిన తరువాత కారులో ఇంటికి బయలుదేరారు. హర్యాతండా సమీపంలో టర్నింగ్ వద్ద కుక్కను తప్పించే క్రమంలో కారు రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న కుమారి, ఇద్దరు చిన్నారులు అక్కడికక్కడే మరణించారు. ప్రవీణ్‌కు తీవ్ర గాయాలు కాగా స్థానికులు ఖమ్మం దవాఖానకు తరలించారు.

నారాయణపేట జిల్లాలో మరో ముగ్గురు మృతి

బైక్, బస్సు ఢీకొన్న ఘటనలో నారాయణపేట జిల్లాలో ముగ్గురు మరణించారు. మక్తల్ ఎస్సై భాగ్యలక్ష్మిరెడ్డి కథనం మేరకు.. మక్తల్‌కు చెందిన ఫొటోగ్రాఫర్లు రాఘవేంద్రచారి, వెంకటేశ్‌తోపాటు మహేశ్ మంగళవారం కాచ్‌వార్‌కు బయలుదేరారు. కర్ణాటకకు చెందిన ఆర్టీసీ బస్సు మక్తల్ శివారులో వీరి బైక్‌ను ఢీకొన్నది. దీంతో వెంకటేశ్, రాఘవేంద్ర అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్ర గాయాలైన మహేశ్‌ను దవాఖానకు తరలిస్తుండగా.. మార్గమధ్యంలో మరణించాడు. బస్సు డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రభుత్వ బడుల్లో సమ్మర్ క్యాంపులు

జూన్ 5 నుంచి 13 వరకు నిర్వహణ

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థలు, ప్రభుత్వ సొసైటీల ఆధ్వర్యంలోని బడుల్లో జూన్ 5 నుంచి 13వరకు సమ్మర్ క్యాంపులు నిర్వహించాలని విద్యాశాఖ నిర్ణయించింది. జూన్ 5న 'వరల్డ్ ఇన్విరాన్‌మెంట్ డే' సందర్భంగా 'ఎకో క్లబ్ ఫర్ మిషన్ లైఫ్' అనే అంశంపై పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ మల్లయ్యభట్టు తెలిపారు.

రోజువారీగా సమ్మర్ క్యాంపులో నిర్వహించే అంశాలు

జూన్ 5న	అడాప్ట్ హెల్త్ లైఫ్ స్టైల్
జూన్ 6న	అడాప్ట్ సస్టెనబుల్ ఫుడ్ సిస్టం
జూన్ 7న	రెడ్యూస్ ఈ-వేస్ట్
జూన్ 10న	రెడ్యూస్ వేస్ట్
జూన్ 11న	సేవ్ ఎనర్జీ
జూన్ 12	సేవ్ వాటర్
జూన్ 13	సేనో టు సింగిల్ యూజ్ ప్లాస్టిక్

టీచర్లకు బదిలీలు, పదోన్నతులివ్వాలి : టీఎస్‌యూటీఎఫ్

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికలు, గ్రాడ్యుయేట్ ఉపఎన్నిక ముగిసిన నేపథ్యంలో ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకొని ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను వెంటనే చేపట్టాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు జంగయ్య, చావ రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 15న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు యూఎస్‌పీసీ, జాక్టో ప్రతినిధులు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంతో జరిపిన చర్చల్లో ఈసీ అనుమతితో బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఇప్పటివరకు ఈ అంశంపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని వాపోయారు. కనీసం ఈసీకి ప్రభుత్వం ఎలాంటి లేఖ పంపలేదని, బదిలీల, పదోన్నతులకు షెడ్యూల్ ఇవ్వడం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఖరిపై నిరసన తెలుపుతున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం విద్యాశాఖలో 22వేల ఉపాధ్యాయ, గురుకులాల్లో 9,200, పార్టు టైమ్, గెస్ట్, అవుట్ సోర్సింగ్ పేరుతో మరో 12 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

టెట్ సోషల్ పరీక్షకు 83.02% హాజరు

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మంగళవారం నిర్వహించిన టెట్ (సోషల్) పరీక్ష కోసం 83.02 శాతం హాజరు నమోదైనట్టు టెట్ కన్వీనర్ రాధారెడ్డి తెలిపారు. తొమ్మిదో రోజు టెట్ పరీక్ష సెషన్-1లో 55 పరీక్ష కేంద్రాల్లో 82.65 శాతం, సెషన్ 2లో 47 కేంద్రాల్లో 84.30 శాతం హాజరు నమోదైందని వివరించారు. సోషల్ సబ్జెక్టులో మొత్తం 28,426 మందికి 23,603 మంది హాజరయ్యారని తెలిపారు. ఈ పరీక్షలు జూన్ 2 వరకు జరుగుతాయని కన్వీనర్ పేర్కొన్నారు.

డ్యాములు, బరాజ్‌ల భద్రతపై ఫోకస్

- మరమ్మతు పనులపైనా ఇరిగేషన్‌శాఖ దృష్టి
- రాష్ట్రంలో 25 డ్యాములకే సేఫ్టీ ఇన్వెస్టిగేషన్స్ పూర్తి
- 65 లిఫ్ట్ స్కీములకు మరమ్మతులు తప్పనిసరి
- ఎస్‌డీఎస్‌వో, ఓఅండ్‌ఎం అధికారుల సమావేశం



హైదరాబాద్, మే28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని డ్యాములు, బరాజ్‌ల భద్రతపై ఇరిగేషన్‌శాఖ అధికారులు దృష్టిసారించారు. మంగళవారం జలసౌధలో స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్(ఎస్‌డీఎస్‌వో), ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్(ఓఅండ్‌ఎం) విభాగాల అధికారులు సమావేశమై రాష్ట్రంలోని అన్ని డ్యాములపై సమీక్ష నిర్వహించారు. గత ఏడాది ఎస్‌డీఎస్‌వో, ఓఅండ్‌ఎం విభాగాల మినిట్స్‌పై చర్చించారు. డ్యామ్ సేఫ్టీ చట్టం ప్రకారం డ్యాములు, బరాజ్‌ల భద్రతను చేపట్టాలని నిర్ణయించారు. ఈ సమావేశానికి ఈఎన్‌సీ(జనరల్) అనిల్ కుమార్, ఈఎన్‌సీ(ఓఅండ్‌ఎం) నాగేందర్ రావు, సంబంధిత విభాగాల ఉన్నతాధికారులు, కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన ఇంజినీరింగ్ అధికారులు కూడా హాజరయ్యారు.

చాలా వరకు పెండింగ్..

రాష్ట్రంలోని మీడియం, మేజర్ డ్యాములు 174 ఉండగా వాటిలో కేవలం 25 డ్యాములకే సేఫ్టీకి సంబంధించిన ఇన్వెస్టిగేషన్స్ చేశారు. మిగతా వాటికి చేయాల్సిన అవసరం ఉంది. ఆయా డ్యాములన్నింటికీ డ్యామ్ బ్రేకింగ్ అనాలిసిస్, ఎమర్జెన్సీ యాక్షన్ ప్లాన్, డిజైన్ ఫ్లడ్ అనాలిసిస్ వంటి ఇన్వెస్టిగేషన్స్ చేయించాలని నిర్ణయించారు. డ్యాముల పటిష్టతను తెలుసుకునేందుకు చేసే డ్యామ్ బ్రేకింగ్ అనాలిసిస్‌ను వాటర్ అండ్ ల్యాండ్ మేనేజ్‌మెంట్ ట్రెనింగ్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కి చెందిన అధికారులతో చేయించనున్నట్టు తెలిసింది. ఆ సంస్థ నుంచి 20 నుంచి 25 మంది వరకు సిబ్బందిని ఎంపిక చేసి శిక్షణ ఇప్పించి బ్రేకింగ్ అనాలిసిస్‌తో పాటు ఎమర్జెన్సీ యాక్షన్ ప్లాన్‌నూ సిద్ధం చేయించాలని నిర్ణయించారు. ఇటు డిజైన్ ఫ్లడ్ అనాలిసిస్‌ను సెంట్రల్ వాటర్ కమిషన్(సీడబ్ల్యూసీ)అధికారులతోనే చేయించాలని నిర్ణయించారు. దానికి సంబంధించి పలు మోడల్స్‌ను పరిశీలిస్తున్నట్టు తెలిసింది. ఆయా డ్యాముల పరిధిలో వస్తున్న ఫ్లడ్ ఎంత, గత 40 ఏండ్లలో వచ్చిన వరద ఎంత.. ఆ డ్యాములను ఎంత ఫ్లడ్ కెపాసిటీతో కట్టారు వంటి వాటిని తేల్చనున్నారు. మరోవైపు కామన్ ప్రాజెక్టులపైనా మహారాష్ట్ర, కర్ణాటక అధికారులతోనూ సమావేశంలో చర్చించినట్టు తెలిసింది. నారాయణపూర్ సీఈ సమావేశంలో పాల్గొనగా.. ఆయన నారాయణపూర్ డ్యామ్‌పై ఇన్వెస్టిగేషన్స్ చేయిస్తామని చెప్పినట్టు తెలిసింది.ఆల్మట్టి ప్రాజెక్టు గురించి అడగ్గా.. తనకు తెలియదని చెప్పినట్టు సమాచారం.

లిఫ్ట్ స్కీములకు రిపేర్లు..

రాష్ట్రంలోని చిన్న,మధ్య తరహా లిఫ్ట్ స్కీముల రిపేర్లపై ఓఅండ్‌ఎం సమావేశంలో చర్చించారు. దాదాపు 65 లిఫ్ట్ స్కీములకు చిన్న, మధ్యస్థ రిపేర్లు చేయించాల్సిన అవసరం ఉందని మీటింగ్‌లో అధికారులు చెప్పినట్టు తెలిసింది. కల్వకుర్తి సహా పలు ఎత్తిపోతల పథకాలకు రిపేర్లు అవసరమని స్పష్టం చేసినట్టు అధికారులు చెబుతున్నారు. మొత్తంగా రూ. కోటి వరకు, ఆ లోపు ఉన్న పనులనే ఓఅండ్‌ఎం ద్వారా చేయించనున్నట్టు అధికారులు చెప్తున్నారు. రూ.కోటికిపైన ఖర్చయ్యే మరమ్మతు పనులను నేరుగా ప్రభుత్వానికే నివేదించనున్నట్టు తెలిపారు.

- **నీటికోసం రోడ్డెక్కిన మహిళలు**

కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేటలోని సాయినగర్ కాలనీకి నాలుగు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది. అధికారులు పట్టించుకోకపోవడంతో ఆగ్రహించిన స్థానికులు మంగళవారం హైదరాబాద్-బోధన్ ప్రధాన రహదారిపై బైఠాయించారు. దీంతో గంటకుపైగా ట్రాఫిక్ స్తంభించి పోయింది. బుధవారంలోపు తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని డీఎల్‌పీవో హామీ ఇవ్వడంతో మహిళలు శాంతించారు. - నాగిరెడ్డిపేట

డీపీహెచ్ సూపరింటెండెంట్ సస్పెన్షన్

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): డీపీహెచ్ కార్యాలయ సూపరింటెండెంట్ సలావుద్దీన్ సస్పెన్షన్‌కు గురయ్యారు. మంగళవారం పబ్లిక్ హెల్త్ డైరెక్టర్(డీపీహెచ్) రవీంద్రనాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. నిజామాబాద్‌కు చెందిన ఓ స్టాఫ్ నర్స్‌పై లైంగిక వేధింపులకు పాల్పడినట్టు సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో అతడిపై కేసు నమోదైనట్టు పేర్కొన్నారు. దీనిపై ఐసీసీ కమిటీ విచారణ జరిపి, నిందితుడిని సస్పెండ్ చేయాలని నివేదిక ఇచ్చిందని చెప్పారు. ఈ మేరకు సలావుద్దీన్‌ను సస్పెండ్ చేస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పూర్తి నివేదిక అందిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆర్టీఏపై ఏసీబీ పంజా

- రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి దాడులు
- ఆఫీసులు, చెక్‌పోస్టుల్లో తనిఖీలు
- ఏసీబీ అదుపులో ఆర్టీఏ ఏజెంట్లు
- రూ.2.7లక్షల నగదు, పత్రాలు సీజ్

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా రవాణా శాఖ కార్యాలయాలు, చెక్‌పోస్టులపై ఏసీబీ దాడులు చేపట్టింది. రవాణాశాఖపై ప్రభుత్వానికి వరుస ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ఈ ఏసీబీ దాడులు జరిగినట్టు సమాచారం. అంతరాష్ట్ర చెక్ పోస్టుల వద్ద నిత్యం వేలాది వాహనాల నుంచి లంచాలు తీసుకుంటున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఆర్టీఏ కార్యాలయాల్లో ఆర్టీఏ బ్రోకర్లు హవా కొనసాగిస్తున్నారని, సామాన్యులు లంచం ఇవ్వనిదే పని కావడం లేదని ఫిర్యాదు అందాయి. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత భారీ ఎత్తున ఆర్టీఏ అధికారుల బదిలీలు జరిగాయని, ఈ బదిలీల్లో పెద్ద ఎత్తున పైరవీలు జరిగాయని ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ఏకకాలంలో ఉమ్మడి పది జిల్లాల పరిధిలోని చెక్‌పోస్టులలో తనిఖీలు చేపట్టారు.

ఖమ్మం జిల్లా అశ్వారావుపేట మండలంలోని అంతరాష్ట్ర సరిహద్దు రవాణా చెక్‌పోస్ట్‌పై ఏసీబీ అధికారులు మంగళవారం దాడి చేసి, ఏడుగురు ప్రైవేట్ వ్యక్తులను అదుపులోకి తీసుకుని రూ.35 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. అక్కడ విధుల్లో ఉన్న ఎంవీఐపై కేసు నమోదు చేశారు.మరోవైపు ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం భోరాజ్ చెక్‌పోస్ట్ దగ్గర లెక్కల్లో లేని రూ. 11 వేల నగదును ఏసీబీ అధికారులు సీజ్ చేశారు. రంగారెడ్డి జిల్లా మణికొండ కార్యాలయంలో 25 మంది అధికారులతో సోదాలు చేపట్టారు. డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో బండ్లగూడ కార్యాలయంలో సోదాలు చేశారు. నలుగురిని అదుపులోకి తీసుకుని, పలు ఫైల్స్‌తో పాటు డబ్బులు గుర్తించారు. మహబూబాబాద్ ఆర్టీవో కార్యాలయంలో ఏసీబీ నిర్వహించిన తనిఖీల్లో ఆరుగురు ఏజెంట్లు, రవాణాశాఖ అధికారి గౌస్ పాషా డ్రైవర్ సుబ్బారావును అదుపులోకి తీసుకున్నారు. ఏజెంట్ల నుంచి రూ.45,100నగదు, డ్రైవర్ నుంచి రూ.16,500నగదు, నూతన లైసెన్సులు,రెన్యూవల్స్, ఫిట్‌నెస్‌కు సంబంధించిన కాగితాలను స్వాధీనం చేసుకున్నారు. పాలమూరు ఆర్టీఏ కార్యాలయంలోనూ తనిఖీలు జరిగాయి. మహబూబ్‌నగర్ ఏసీబీ డీఎస్పీ కృష్ణగౌడ్ ఆధ్వర్యంలో అధికారులు రికార్డులను పరిశీలించారు. ఇద్దరు ప్రైవేట్ ఏజెంట్లను, కారు అద్దెకు పెట్టి టెస్ట్ డ్రైవింగ్‌కు డబ్బులు వసూలు చేస్తున్న మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. సిద్దిపేట ఆర్టీవో కార్యాలయంలో ఏసీబీ సోదాలు రాత్రంతా కొనసాగాయి. డీఎస్పీ రేంజ్ అధికారితో పాటు సుమారు 15 మంది అధికారులతో కూడిన బృందం ఈ దాడుల్లో పాల్గొన్నారు. కార్యాలయంలోని కంప్యూటర్లను, రిజిస్టర్‌లను, కీలక ఫైల్స్‌ను పరిశీలించారు. రవాణా శాఖ కార్యాలయ సమీపంలో ఉన్న ఏజెంట్లు వారి కార్యాలయాలను మూసివేశారు. నిజామాబాద్ జిల్లా సాలూర ఆర్టీఏ చెక్‌పోస్టుపై ఏసీబీ అధికారులు దాడి చేసి, కంప్యూటర్ ఆపరేటర్ వద్ద రూ.13,500 నగదును సీజ్ చేశారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌లోని ఆర్టీఏ కార్యాలయంలో ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి, సీఐ కృష్ణకుమార్ ఆధ్వర్యంలో బృందం దాడులు చేపట్టింది. వినియోగదారుల నుంచి ఏజెంట్లు అధిక నగదు తీసుకుని 'సీ' 'డీ' లాంటి కోడింగ్‌లు స్లాట్ పత్రాలపై ఇచ్చినట్టు గుర్తించామని తెలిపారు. నల్లగొండ ఆర్టీఏ కార్యాలయంలో ఏసీబీ డీఎస్పీ జగదీశ్‌చంద్ర ఆధ్వర్యంలో దాడులు చేసి ఆరుగురు ఏజెంట్లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.12,500 నగదు, 50 నుంచి 60 లైసెన్స్‌లకు సంబంధించిన డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరిపిన ఏసీబీ దాడుల్లో మొత్తం రూ.2.70 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్టు అధికారులు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ అధికారులు లంచం డిమాండ్ చేస్తే 1064 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని ఏసీబీ అధికారులు సూచించారు. ఈ దాడుల్లో 15 టీమ్‌లు పాల్గొన్నాయని, కేసులు నమోదు చేసిన నివేదికను ప్రభుత్వానికి అందజేసినట్టు ఏసీబీ అధికారులు తెలిపారు.

మహబూబాబాద్ ఆర్టీవో కార్యాలయంలో తనిఖీలు చేస్తున్న ఏసీబీ అధికారులు